

# ఆమెనా తల్లి

నేను దొంగను.

నిజంగా దొంగ అయినవాడు ఎవడూ ఇలా బరితెగించి బాహాటంగా చెప్పుకోడు; చెప్పుకో లేడు. నేను దొంగను కానని అనుకుంటారేమో? మీ కలాంటి సందేహ మేమీ అక్కర్లేదు. నేను దొంగనే.

అయితే, నువ్వెవడివో చాలా గొప్పవాడివి అయి ఉంటావు. తత్త్వవేత్తవేమో? లేక ఋషివో? కాకుంటే అలా చెప్పుకొనేపాటి ఆత్మస్థైర్యం, అన్నిటినీ మించి నిజాయితీ నీకు ఎక్కడివి?

అని కొందరు ప్రశ్నించవచ్చు. అలాంటి ఆశ లేమీ పెట్టుకో నక్కర్లేదు. నేను దొంగను.

మరయితే—ఇంతటి నిజాయితీ నీ కెలా వచ్చింది అని అడుగుతా రేమో?

చావడానికి సిద్ధంగా ఉన్న మనిషికి అబద్ధం చెప్పవల సిన అవసరం ఏముంది? చెప్పి ఇంకా బావుకొనేదేముం టుంది? అవసరం లేదుకనుక ఇప్పుడు నేను నిజాయితీ చూపు తున్నాను.

నేను ఇలా అంటూంటే చిత్రంగా ఉండికదూ? ఉంటుంది మరి.

అసలు ఆ నిజాయితీయే నా కొంప ముంచిందని తెలుసు కొన్నప్పుడు మీరు మరింత విస్తుపోతారు. 'ఎవరి నిజాయితీ' అని అడగకండి. నేను చెప్పలేను. నాకు తెలియదు.

నిజాయితీ మహోత్తమమైనది; నిజాయితీ ఉన్నవాడు దైవాంశసంభూతుడే అయివుంటాడు; మనశ్శాంతి ఉన్నవాడు మకుటంలేని రాజేను; ఎప్పటికైనా నిజాయితీ అనేది గెలు పొంది తీరుతుంది అంటారు.

నన్నడిగితే నిజాయితీ శుద్ధమూర్ఖత్వం అంటాను.

'దొంగేమిటి, నిజాయితీ మూర్ఖత్వ మనడమేమిటి? ఒకవేళ అన్నా వినేవా రెవరు' అంటా రేమో!

నేను దొంగ అయిన మాట ఎంత నిజమో, నిజాయితీ మూర్ఖత్వ మనేదీ అంతే నిజం. స్వానుభవ మది. అంతకు మించిపోయే శక్తీ లేదు నాకు.

5

అయితే ఒక్కటి మాత్రం అంగీకరించాలి. నాకు మొదటినుంచీ నిజాయితీమీద అంత నమ్మకమేమీ లేదు. ఆ మాటకు నస్తే అసలు లేదు. మరి దొంగవికదా అంటా రేమో? అది కారణం కాదు. నేను మొదటినుంచీ దొంగను కాను. నిజాయితీ మూలంగా దొంగ అయినవాణ్ణి నేను.

హరి—వాడే నా మేనల్లుడు—నిజాయితీ ఉన్నవాడు. అయినా వాడికి నామీద ఎంతో ఆపేక్ష ఉండేది.

మా హరిమీద మాకు—ముఖ్యంగా నాకు—ఎన్నో ఆశలు ఉండేవి. చదువు బాగా చెప్పించాము. అప్పే చేశామో, సప్పేచేశామో, ఎలాగో ఒకలాగు వాడు పెద్ద చదువులు చదివి, ఆఫీసరై పదిమందిలో ఓహో! అనిపించు కొనేలా చేశాము. మేము అంటే హరితల్లి, మా అక్కయ్య సరస్వతీ, నేనూ.

ఇంత చేసినవాళ్ళం వాడిమీద ఆశలు పెంచుకున్నా మంటే తప్పేమిటి? ఉన్నమాట చెప్పుకోవాలి. అలా అంటే మా హరికూడా ఎప్పుడూ కాదనేవాడు కాదు.

ఆఫీసులో హరిది పెత్తనం అయితే ఇంట్లో మాది-అంటే మా అక్కయ్యదీ, నాదీ. మా అక్కయ్య—చచ్చి ఏ లోకాన ఉన్నదో కాని—ఎప్పుడూ నా మాట వినేది. అందు చేత మొత్తంమీద ఇంటి వ్యవహారాలు, డబ్బు వ్యవహారాలు అన్నీ నా చేతిలోనే ఉండేవి. హరి కూడా నెల కాగానే లక్షణంగా జీతపురాళ్ళు తెచ్చి నా చేతిలో పోసేవాడు.

హరి సంపాదన తక్కువకాదు. అయితే మాత్రం? బాధ్యతలు పెరుగుతాయేకాని తరగవు. ఖర్చులు సరే సరి. దీపం ఉండగానే కదా, ఇల్లు చక్కబెట్టుకోనడం?

ఒకసారి ఒక పెద్దమనిషి మా వాడి సహాయం కోరాడు. చిన్నదీ చితకదీ కాదు. పెద్ద వ్యవహారమే. లక్షలమీద ఉంది. కీలకమేమో మావాడి చేతిలో ఉంది. చూసీచూడనట్టు ఒక సంతకం గిలికేస్తే సరి. అంతా సర్దుకు పోతుంది.

ఆ తరువాత ఏమైనా గొడవవస్తే క్రిందివెధవల్లో ఎవడిమీదో తోసేస్తే పీడా పోతుంది.

అవతల ఆయన కూడా చాలా పెద్దమనిషి. అన్నది ముందే నా చేతుల్లో పోశాడు. గొడవపెట్టే రకం కాదు. దానివల్ల నష్టపోయేది కూడా అతనే.

చిన్నపనికి పెద్ద లాభం—ఉభయులకూ. హరి నా మాట జవదాటే రకం కాదు. చెయ్యకపోతేకదా అని ఒప్పుకున్నాను.

నాకు తెలియకుండా హరిలో మార్పు వచ్చేసింది.

“వీల్లేదు. మావయ్యా!” అనేశాడు.

ఎంత చెప్పినా వినిపించుకోలేదు. మాటా మంతీ లేదు. హరి స్వభావమే అంత. అవును, కాదు అంటాడు. అంతే.

మా అక్కయ్యచేతకూడ చెప్పించాను. వినలేదు.

“మరి డబ్బు కూడా పుచ్చుకున్నాను. ఖర్చు అయిపోయింది, చాలమట్టుకు. మధ్య నేను ఇరుకునపడ్డాను. ఇప్పుడు నువ్వు కాదంటే నేను నుయ్యో గొయ్యో చూచుకుంటాను” అన్నాను.

"మామయ్య మాట కాదంటే పుట్టగతులుండవురా" అని తల్లి బుద్ధి చెప్పింది.

"తప్పేమిటిరా? ఎందరు చెయ్యడం లేదు?" అని నిలదీసింది.

మా హరి శుద్ధ బుద్ధావతారం, మాట్లాడితే కదా?

ఆ వేళతో వ్యవహారానికి కాలదోషం పట్టుతుంది. సర్వనాశనమూ అవుతుంది. ఊరుకొంటే ఎలా?

మా వాడు ఆఫీసుకు వెళ్ళుతూంటే ఆఖరిసారి నిలదీశాము. మా అక్కయ్యా, నేనూ.

ఏ కళను ఉన్నాడో, సరేనన్నాడు. అక్కయ్యా, నేనూ కొండ ఎక్కేశాము.

వ్యవహారం సానుకూలం అయింది. మా వాడు మాత్రం పరారీ అయ్యాడు. ఆ తరువాత తెలిసింది. ఉద్యోగానికి రాజీనామా యిచ్చాడని.

ఇదంతా నామూలంగా జరిగిందని మా అక్కయ్య నన్ను ఇంట్లోంచి పొమ్మంది. మళ్ళీ గడప తొక్కవద్దంది.

హరిభార్య—చెప్పానో లేదో, మా హరికి పెళ్ళయిందని?-పిల్లవాడిని తీసుకొని, పుట్టింటికి పోయే మార్గం లేక, ఆ ఊళ్లోనే మరొకచోట కాపురంపెట్టి పంతులమ్మగా పొట్ట పోసుకోనడానికి నిశ్చయించుకొని వెళ్ళిపోయింది.

ఈ విధంగా మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉన్న సంసారం విచ్ఛేదమయింది.

మా హరి నా మాట నిలబెట్టాడు. సంతోషం. నేను కాదనను.

మరి నే నేమయ్యాను?

దొంగను అయ్యాను.

ఎందుకని అడగకండి. ఎలా అనీ అడగవద్దు.

ఒక్కటి చెబుతాను.

ఈ లోకంలో నీతిగా, నిజాయితీగా బ్రతకడం చాలా కష్టం. చాలా సందర్భాలలో అసంభవం.

మేనల్లుడు హరి కనిపించకుండా పోయాడు. అక్కయ్య సరస్వతి మరి కొలదికాలానికే ఇహలోకమే విడిచింది. హరి భార్యాబిడ్డలు దిక్కులేకుండా పోయారు.

నేను వరసకు పెద్దవాణ్ని. వయసులో హరికి దగ్గర వాణ్నీను. నాకు పెళ్ళీ పెటాకులు కాలేదు.

వాళ్ళే నావాళ్లు. వాళ్ళను మించిన వాళ్ళు నాకు లేరు.

అపరాధం నాది; శిక్ష అనుభవించేది వేరొకరు. నేను అనుభవించేది స్వల్పం; వేరొకరు అనుభవించేది అనంతం. ఇది నాకు రుచించలేదు.

కేవలం నా పొట్టకోసమే అయితే నేను ఇన్ని పనులు చేయనక్కరలేదు. కాని నా జీవితం నాకోసం జీవించవలసినది కాకుండా పోయింది. జీవించకుండా ఉండనూ లేను.

కనుక దొంగనయ్యాను.

నాలక్ష్యమూ సఫలమైంది.

కనీసం నిన్నామొన్నటి వరకూ అలాగే అనుకొంటూ వచ్చాను. అది నమ్మకంగా ఘనీభవించి నాకు ఆత్మతృప్తిని ప్రసాదిస్తూ వచ్చింది.

ఇప్పుడు అదీ తలక్రిందులు అయింది. చెబుతాను వినండి.

ఈ ఊళ్లో కాదు, మరొక ఊళ్లో ఈ మధ్య కన్నం వేయడానికి ప్రయత్నించాను. అనుపానులన్నీ కనుక్కొని, కాస్త ఉన్న కొంపలాగే ఉందని నా తోడి దొంగ చెప్పాడు.

దొంగకు తోడేమిటి అంటారేమో? దొంగలకే తోడు ఉంటుంది అసలు.

దొరను దొర నమ్మడు. చేరదీయడు. చేరదీసినా కాట్లాడతాడు. తలలు నరుకుతాడు. మోసం చేస్తాడు. లాభం ఉంటే మరీను. కష్టం ఉంటే, ఎదుటివాడు నాశనమైతే చాలు నంటాడు.

దొంగ అలా కాదు. దొంగను చేరదీస్తాడు. నమ్ముతాడు. కూడబలుక్కొని చేస్తాడు. లబ్ధి పొందుతాడు. ఉన్నంతలో సుఖం అనుభవిస్తాడు.

నేను చాలాకాలం ఎవర్నీ చేరదీయలేదు. ఒంటరిగానే దొంగతనాలు చేశాను.

నన్నడిగితే నిజానికి దొంగతనాలకు తోడు అక్కర్లేదు అంటాను. ఏమంటే దొంగతనం చేయడం అంత సులభమైంది మరొకటి లేదు.

దొరకు భయం జాస్తి. దొంగకు సున్నా.

ఎక్కడ దొంగ వస్తాడోనని దొర భయపడుతూ వణుకుతూ ఉంటాడు. మెలకువగా ఉన్నా ప్రాణం దక్కితే చాలని కళ్ళు తెరవడు.

దొంగకు పోయేది లేదు. బాహాటంగా తన పని కానిచ్చుకుని వెళ్ళిపోతాడు.

దొరభయమే దొంగ ఆస్తీ, పెట్టుబడీ మరి.

ఆఖరిసారి జైల్లో పడ్డప్పుడు జబ్బు పడ్డాను. అందుచేత ఒకరి ఆసరా అవసరమైంది. చాలా కాలంగా నన్ను వేధిస్తున్నా డొక పడుచువాడు. వాణ్ని ఆసరా చేసుకొన్నాను. ఇప్పుడు వాడు స్వతంత్రంగా వ్యాపారం చేసుకునే స్థితికి వచ్చాడు. శుభం.

వాడిద్వారా ఆనుపానులు లాగాను. ఆ రాత్రి ఆ యింట పడ్డాను. నా జీవితం మళ్ళీ గాడి తప్పిపోయింది.

దీపాలు ఆరిపోయి ఉన్నాయి. కాని మనుషులు మాత్రం మెలకువగా ఉన్నారు. ఇంతాచేసి ఇద్దరు. ఆ ఇద్దరూ ఎవరో కారు: మా హరీ, హరి భార్యాను.

నాకేం తెలుసు—హరిభార్య ఈ ఊరు వచ్చేసిందని?

అంతకాలమూ దొంగతనం చేసి సంపాదించిన బాపతు సొమ్ము హరిభార్యకు పంపుతూనే ఉన్నాను మనిఆర్డరు ద్వారా.

పంపడం మట్టుకే నాకు తెలుసు. చేరిందో లేదో తెలుసుకునే అవకాశం నాకు లేదు.

మనిఆర్డరులో ఒక సౌకర్యం ఉంది; ఒక ఇబ్బందీ ఉంది.

నేను దొంగను కనుక నాకు అడ్రసు లేదు. ఉన్నా ఇవ్వలేను. అంటే ఏదో అడ్రసు ఇవ్వొచ్చు. పంపినవాడి నిజాయితీ శంకించదు తపాలాశాఖ. అదృష్టం. అదే సౌకర్యం.

కాని రసీదు నాకు తిరిగిరాదు. అది నా అడ్రసు కాదు గనుక. అసలు అలాంటి అడ్రసు లేదు గనుకా. అంతవరకూ నేను ఏ ఊళ్ళోనూ ఆగలేదు మరి, చేరిందో లేదో నాకు తెలియదు. అదీ ఇబ్బంది. అందుచేత హరిభార్య ఉన్న ఊరు విడిచిన సంగతి నాకు తెలియడానికి ఆస్కారం లేదు.

హరిభార్య ఇంట్లో పడిన రాత్రి చాలానే తెలుసు కున్నాను. క్లుప్తంగా చెప్పేస్తాను. నాకు వ్యవధి లేదు. ప్రయాణానికి వేళ అయింది.

ఉద్యోగం విడిచి వెళ్ళిన తర్వాత ఏం చేశాడో, చేయలేదో కాని, హరి కొంత కాలానికి భార్యదగ్గరకు తిరిగి వచ్చాడు.

హరికి సంఘంమీద, ప్రపంచంమీద అసహ్యం, రోత. సంఘం–అంటే నేను ప్రాతినిధ్యం వహించిన సంఘం—హరికి ద్రోహం చేసింది. నిజమే కనుక సంఘానికి ఏ విధంగానూ సేవ చేయడు.

అంతేనా? సంఘంవల్ల హరి నష్టపోయాడు. కనుక పగ తీర్చుకుంటాడు. సంఘానికి ప్రాతినిధ్యం వహించే తన భార్యను శిక్షించడంద్వారా పగ తీర్చుకుంటాడు. తీర్చుకున్నాడు. బాగానే తీర్చుకున్నాడు.

తన సంపాదనతో సరిపెట్టుకుంటూ మొదట్లో హరి భార్య ఎక్కడినుంచో వచ్చే మనిఆర్డర్లు తీసుకునేది కాదట. అనుమానం, ఆత్మాభిమానం అడ్డువచ్చాయి.

భర్త పునరాగమనం, అనుభవం ఆమెకు చక్కటి పాఠాలు నేర్పాయి. పరివర్తన వచ్చింది.

తన సంపాదన అంతా భర్తకు యిచ్చేది. హరి తీసుకునేవాడు. మనిఆర్డర్లతో కొడుకుకు చదువు చెప్పించింది.

హరి తెలివితక్కువవాడు కాడు. కొడుకు చదువు ఎలా సాగుతూందో తెలుసుకొన్నాడు.

ఫలితం—ఆ డబ్బుకోసం ఆమెను బాధించసాగాడు. చాలా నే హింసించాడు.

అంతా సహించింది ఆ తల్లి. కొడుకు చదువు గట్టెక్కించింది. హరికి తెలియకుండా ఉన్న ఊరు విడిచి, కొడుకును తీసుకొని ఆ ఊరు వచ్చేసింది.

కొడుకు స్థిరపడగా చూసింది. కొడుకు పెళ్ళి అయితే చూసి తనువు చాలిద్దా మనుకుంది. కొడుకు పెళ్ళికోసం డబ్బు జాగ్రత్త చేసింది.

ఎలా తెలుసుకున్నాడో? హరి ఈ ఊరు వచ్చాడు. ఆ రాత్రే భార్యను నిర్బంధిస్తున్నాడు. ఉరైనా పోసుకుంటాకాని ఇంక డబ్బుఇవ్వనంటుంది ఆ తల్లి. జీవితంలో ఎప్పుడూ ఒక్క తప్పుచేసి ఎరగదు. సుఖమూ ఎరగదు. ఎప్పుడూ కష్టాలే, బాధలే అనుభవించింది.

జీవితం అంతే. తప్పు ఎరగనివాళ్లు సుఖపడరు. అదే జీవితం అయినవాళ్లు దుఃఖం ఎరగరు. నిజాయితీ ఉన్నవాళ్లు డబ్బు ముఖం చూడరు. నాలాంటివాడికి గొడవ ఉండదు.

హరిభార్య సహనం ఏనాడో నశించింది. కొడుకుకోసం అంతకాలమూ బ్రతికింది. ఇప్పుడు ఆ కొడుకు తనంతట తాను బ్రతకగలడు. తను బ్రతికి ఉండవలసిన అవసరం లేదు. తల్లిగా తన కర్తవ్యం తీరిపోయింది.

ఇక భర్త. వదిలించుకుందామని కోరుకొంది. వదిలించుకొంది. విరగడ అయిందనుకొంది. చరమకాలంలో సుఖం చవిచూద్దామనుకొంది. భర్త వదలలేదు.

అంతకాలమూ ఒక్క కోరిక ఉంది ఆమెకు. కొడుకు పెళ్ళి చూడాలని. ఇప్పుడు ఆ కోరికకూడా చంపుకొంది.

కాని కొడుకు పెళ్ళికి ఉంచిన డబ్బుమాత్రం ససేమిరా భర్తకు ఇవ్వనంది.

నేను దొంగను. సంఘంలో మనిషిని కాను. నాకు ఉనికి లేదు. అంతకాలం నన్ను ఎవరూ చూడనూ లేదు. నాకు కోరికా లేదు. అందుచేత జోక్యం చేసుకోలేకపోయాను.

హరి భార్య నూతిలో దూకింది. హరి పారిపోయాడు.

నాపాత్ర ఏమిటో మరచిపోయాను. బయటికి ఉరికాను. పొలికేకలు వేస్తూ కారుక్రింద పడిపోయాను.

అవతారం చాలించాసని ఆనందించిన నాకు ఆస్పత్రిలో మీరు కనిపించారు.

'ఎందుకు బ్రతికించారు, బాబూ' అని ఆక్రోశించాను– మీకు తెలుసు.

'బ్రతికించిన వాణ్ని కాదు నేను. కేవలం వైద్యుణ్ని. అందర్నీ బ్రతికించేవాడు భగవంతుడు. ఆయనే నిన్నూ కాపాడాడు' అన్నారు మీరు.

ఎందుకు బ్రతికించావు తండ్రీ? అని నేను భగవంతుని నిందిస్తే, ఒక్కరినైనా బ్రతికించ గలిగినందులకు భగవంతునికి మీరు ధన్యవాదాలు సమర్పించారు.

హరి ఏమయ్యాడో నాకు తెలియదు. తెలుసుకోవాలనీ లేదు.

హరిభార్య ఏమైందో తెలియదు. తెలుసుకోవాలనీ లేదు. కాని ఆమె ప్రాణం పోకుండా ఉండాలనీ, చరమ కాలంలో అయినా ఆ నిర్భాగ్యురాలు కొడుకు చేతిలో సుఖించాలనీ నా కోరిక. జీవితంలో ఏ కోరికా కోరలేదు నేను.

ఈ ఒక్కటీ భగవంతుడు తీర్చితే నా ఆత్మ శాంతి స్తుంది. నే చేసిన పాపం ఏమీ ఎరగని ఆ అమాయకురాలి జీవితం నాశనం చేసిందని ఒక్కటే బాధ.

చాలా చెప్పాను. చాలా ఓరిమితో విన్నారు. కృతజ్ఞుణ్ని.

నాకు పిలుపు వచ్చింది. వెళుతున్నాను. సెలవు.

*　　　*　　　*

కారుక్రింద పడిన క్షణంనుంచి ఆఖరి క్షణంవరకూ ఆ వృద్ధుడు స్మృతిని కోలుకోనలేదు. అచేతనంగా ఉన్న దశలో అన్నమాటలు గుదిగుచ్చి ఈ స్వరూపంలో మీకు అంద జేస్తున్నాను.

నేను రచయితను కాను. వైద్యుణ్ని. ఆ వృద్ధునికి వైద్యంచేసిన వాణ్ని నేనే.

అతడి పాపంలో నాభాగం ఎంతో తెలుసుకోలేకుండా ఉన్నాను. నా కర్తవ్యం ఏమిటో కూడా తెలియదు. ఇది వేరువిషయం.

ఒక్కటే విచారం. ఆ వృద్ధుని ఒక్క కోరిక నెరవేర లేదు.

ఆ హరిభార్య బ్రతకలేదు. ఆ రాత్రే మృతిచెందింది.

ఆమెను కాపాడడానికి నేచేసిన ప్రయత్నం ఫలించ లేదు. ఆ వృద్ధునికన్న అధికంగా ఆమె బ్రతకాలని కోరు కున్నాను నేను. ఏమైనా చేయగలను. కాని ఆమెను కాపాడ లేక పోయాను. నా అదృష్టం అలాంటిది.

ఆ వృద్ధునికన్నా అధికంగా ఆమె బ్రతకాలని, సుఖిం చాలని నేను కోరుకోనడానికి ఒక్కటే కారణం ఉంది. ఆమె నా తల్లి.

———